క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ ఎస్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ బడంగ్‌పేట ఫీడర్ పరిధిలోని భీష్మానగర్, శిరిడీ ఎన్‌క్లేవ్, గందారెడ్డికాలనీ, సాయిగోకుల్, సాయినగర్, రైతుబజార్, లెనిన్ నగర్, హుడాకాలనీ, అన్నపూర్ణకాలనీ, బృందావన్‌కాలనీ, చింతలకుంట, లెనిన్‌నగర్ ఓల్డ్ విలేజ్‌లలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే సబితారెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరామకాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మాజీ కో–ఆప్షన్ సభ్యుడు సూరెడ్డి కృష్ణారెడ్డి ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాజీ కౌన్సిలర్ పల్లపు శంకర్, బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పుమూరి నిరంజన్, మారుతితో గురువారం ఎమ్మెల్యేను కలిసి సమస్యలను విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో పూర్తిస్థాయిలో సీసీరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు వేయాలన్నారు. కమ్యూనిటీ హాళ్లను కూడా నిర్మిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాదగిరిమాదిగ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు శ్రేణులు ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి యాదగిరిమాదిగ కోరారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేసేలా దిమ్మెలు నిర్మించాలన్నారు. ఆవిర్భావ దినోత్సవంలోపు అన్ని గ్రామాల కమిటీలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబుమాదిగ, నాయకులు కృష్ణమాదిగ, నాని మాదిగ, చెన్నయ్యమాదిగ, ప్రవీణ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ ‘భరోసా’ అందించాలి

కందుకూరు: రైతు భరోసా నిధులు రైతులందరికీ పూర్తిస్థాయిలో అందించాలని డీబీఎస్‌యూ (దళిత బహుజన శ్రామిక యూనియన్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గండు నర్సింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వాస్తవంగా ఉన్న విస్తీర్ణం కంటే తక్కువగా రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమయ్యాయన్నారు. దీంతో చాలామంది రైతులకు ప్రభుత్వం ఆశించిన మేర ప్రయోజనం అందలేదన్నారు. అధికారులను అడిగితే డిజిటల్ సర్వే ప్రకారం వేశారంటున్నారన్నారు. ప్రతీ గ్రామంలో ఇదే తరహాలో రైతులకు ప్రభుత్వం అందించే రైతు భరోసా అందలేదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రాని వారికి అందించాలని కోరారు.

ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

సైదాబాద్: దేశ చరిత్రలో ఎమర్జెన్సీ విధింపు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చలా మిగిలిపోతుందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ అన్నారు. అప్పటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో సైదాబాద్ డివిజన్ పరిధి ఎస్‌బీహెచ్ సీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఎమర్జెన్సీ వ్యతిరేక దినం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజల ప్రాథమిక హక్కులు కాలరాయడం, పత్రికా స్వేచ్ఛకు భంగం కలగడం, ప్రతిపక్ష పార్టీల నాయకులపపై ప్రతీకార దాడులు, అరెస్టుల గురించి నేటి తరం యువతకు నాయకులు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సుభాష్‌చందర్జీ, కార్పొరేటర్లు కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి, పార్టీ నాయకులు సహదేవ్ యాదవ్, లింగాల హరిగౌడ్, వీరేంద్రబాబు పాల్గొన్నారు.

అల్లనేరేడు.. లాభాలు బోలెడు

- విరివిగా లభించే పండ్లు
- మధుమేహ వ్యాధిగ్రస్తులకు దివ్యౌషధం
- విటమిన్లతో పాటు క్యాల్షియం పుష్కలం
- మార్కెట్లో మంచి డిమాండ్

హుడాకాంప్లెక్స్: సీజనల్‌గా వచ్చే అల్లనేరేడు పండ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. తియ్యదనం, పులుపు, వగరు మేలు కలయికే అల్లనేరేడు. నల్లగా నిగనిగలాడే ఆ పండ్లను చూస్తే ఎవరికైనా నోరూరాల్సిందే. సహజ సిద్ధంగా లభించే ఫలాల్లో అల్లనేరేడు ఒకటి. వాటిలో ఔషధ లక్షణాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. మధుమేహ రోగులకు ఇది చేసే మేలు ఎంతో. శరీరంలోని చక్కెరస్థాయి నియంత్రణలో ఉంటుంది. సీజన్‌లో ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం పది పండ్లయినా తింటే ఎంతో మంచిది. కిడ్నీ వ్యాధులను అల్లనేరేడు నయం చేస్తుంది. చిన్నసైజు రాళ్లుంటే ఈ పండ్లు ఎక్కువగా తింటే కరిగిపోయే అవకాశం ఉంది. ఇలా ఒకటి, రెండు వ్యాధులకే కాకుండా మల్టీ విటమిన్ గల ఈ ఫ్రూట్ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పండ్లను తిని, ఆ తర్వాత వాటిలోని గింజలను ఎండ బెట్టి ఔషధంగా వినియోగిస్తున్నారు.


అల్లనేరేడు పండ్లు

రోడ్లకు ఇరువైపులా అమ్మకాలు

ప్రతీ ఏడాది ఏప్రిల్ నెలలో పూత కాత మొదలై జూన్, జూలై వరకు పండ్లు పుష్కలంగా లభిస్తాయి. ఔషధ గుణాలు కలిగిన అల్లనేరేడు పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వీటిని కొనుగోలు చేసేందుకు సిటిజన్లు ఆసక్తిచూపుతుండటంతో వ్యాపారులు వీటిని ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి దిగుమతి చేసుకుంటున్నారు. ఇటు ఎల్బీనగర్ చౌరస్తా నుంచి అటు దిల్‌సుఖ్‌నగర్ వరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న సర్వీసు రోడ్లపై ఎటూ చూసినా ఈ పండ్లే ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. విక్టోరియా మెమోరియల్ స్కూల్, సరూర్‌నగర్, కొత్తపేటలో తోపుడు బండ్లపై రాశులుగా పోసి అమ్ముతున్నారు. పండ్ల నాణ్యతను బట్టి కేజీ రూ.80 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు.

గుండె వ్యాధుల నివారణ



ఫలాల్లో చెప్పుకోదగినవి అల్లనేరేడు పండ్లు. గుండె సంబంధిత వ్యాధులను నయం చేస్తాయి. రక్తపోటును నివారించడమే కాకుండా కాలేయ పనితీరును మెరుగుపరుస్తుంది. అధిక మోతాదులో పండ్లను తింటే రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు ఎముకలకు పరిష్టిని ఇస్తుంది. ఈ పండ్లు తింటే శరీరానికి చలువ చేస్తుంది. మధుమేహ రోగులకు ఇది చేసే మేలు ఎంతో. శరంలోని చక్కెరస్థాయి నియంత్రణలో ఉంటుంది.

– డా.ఏపీ చారి, సీనియర్ వైద్యనిపుణుడు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి


మాట్లాడుతున్న పాండురంగారెడ్డి

మహేశ్వరం: గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పోరండ్లలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్, గ్రామ స్థాయిల్లో పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లు గెలుపొందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా డబుల్ ఇళ్లు, దళిత బంధు పథకాలను ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కంబాలపల్లి మధన్‌పాల్‌రెడ్డి, బూస రమోని యాదయ్యముదిరాజ్, బండ వేణుగోపాల్, బొక్క సంజీవరెడ్డి, పాండు ముదిరాజ్, ప్రభాకర్, పుష్పలత పలువురు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి

టీపీసీసీ జనరల్ సెక్రటరీ జంగారెడ్డి


మాట్లాడుతున్న జంగారెడ్డి

మహేశ్వరం: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ జంగారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని మహేశ్వరం, మన్సాన్‌పల్లి, ఉప్పుగడ్డ తండా, గంగారం గ్రామాల్లో ఆయన కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి పర్యటించి మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ఆదేశానుసారం పార్టీ బలోపేతంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ నాయకుడు, కార్యకర్త ప్రజలకు తెలియజేసి చైతన్యవంతం చేయాలని కోరారు. అంతకుముందు మండలంలోని గ్రామాలను 8 క్లస్టర్లుగా విభజించి కమిటీలను నియమించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బొక్క జంగారెడ్డి, నేనావత్ ఈశ్వర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, మండల మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్, పార్టీ సీనియర్ నాయకులు వత్తుల రఘుపతి, శ్రీధర్ ముదిరాజ్, జగన్, రాజా ప్రతాప్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, నర్సింహ, సత్యనారాయణరెడ్డి, లాజర్, సుభాష్ పలువురు పాల్గొన్నారు.

పైపులైన్ మంజూరుపై హర్షం

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని పహాడీషరీఫ్ రాజీవ్‌గాంధీనగర్‌లో డ్రైనేజీ పైపులైన్ నిర్మాణానికి కృషి చేసిన బీఆర్‌ఎస్ మున్సిపల్ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు మహ్మద్ మక్దూంపటేల్‌ను స్థానికులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల క్రితం ఏర్పడిన రాజీవ్‌గాంధీనగర్‌లో ఇన్నాళ్ల పాటు డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆమె పైపులైన్ మంజూరు చేయించారన్నారు. కాలనీలో దశల వారీగా అభివృద్ధి పనులు జరుగుతుండడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మహ్మద్ నయీం, సయ్యద్ యూసుఫ్, జహంగీర్ ఖాన్, ఫెరోజ్, రహీం, ఇమ్రాన్ పటేల్, అమీర్ పటేల్, అర్బాజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.


మక్దూంపటేల్‌ను సన్మానిస్తున్న బస్తీవాసులు

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు

ఎస్‌ఐ మధుసూదన్


మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో మానవహారం

మహేశ్వరం: యువత డ్రగ్స్, గంజాయి బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ మధుసూదన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డ్రగ్స్, గంజాయి వాడకంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయికి అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయన్నారు. శారీరక, మానసికంగా ఇబ్బందులు గురవుతారని తెలిపారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి అందరం సమష్టిగా కృషి చేద్దామన్నారు. యువత, విద్యార్థులు మంచి మార్గంలో నడిచి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. మత్తు పదార్థాలను ఎవరు అమ్మిన, కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకు ముందు మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా విద్యార్థులు మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థులకు డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కస్నానాయక్, కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగి రమేశ్, ఎన్‌ఎస్‌ఎస్ హెడ్ డా.జాహేదాబేగం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.చందన, అధ్యాపకులు ఇంతియాసుద్దీన్ ఫారూఖీ, ఉపేంద్ర, గోపాల్, చిన్నోజీ,శ్రీదేవి, నరేందర్‌రెడ్డి, కుమార్, రమేశ్, సన్నీ పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

కందుకూరు: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, విద్యామయి జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సైదులు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, వాటికి దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం, బాల్య వివాహాలు తదితర అంశాలపై వివరించారు. మండల వైద్యాధికారి డాక్టర్ సుల్తానా మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను వినియోగిస్తే ఆరోగ్యం దెబ్బతింటుందని, వాటి వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, అంగన్‌వాడీ టీచర్లు యశోధ, సుమతి, దీప, రాధిక, కల్పన, స్వాతి తదితరులు పాల్గొన్నారు.


మాదకద్రవ్యాల నిర్మూలన పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ సైదులు, అంగన్‌వాడీ సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్


తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వెంకట్రామ్

పహాడీషరీఫ్: వర్షాకాలంలో విషజ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా శ్రీరామకాలనీలో గురువారం స్థానికులకు పారిశుద్ధ్యం, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ సిబ్బందికి అందించనట్లయితే సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు వీలుంటుందన్నారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడూ చెత్తను సేకరిస్తున్నామన్నారు. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా చెత్త పాయింట్ల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ జ్యోతిరెడ్డి, పర్యావరణాధికారి ఎం.శ్రీను, సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మలక్‌పేట: యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్, చేయూత, ఇండియా మెడికల్ మిషన్ సౌజన్యంతో గురువారం దిల్‌సుఖ్‌నగర్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ బోడా సాల్మన్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో పాల్గొన్న 289 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు, 94 మంది కంటి అద్దాలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ శాంత్‌కుమార్, చర్చి కమిటీ అధ్యక్షుడు వేమూరి లూకానందరావు, డాక్టర్లు, వైద్య సిబ్బంది, చర్చి మెంబర్స్ పాల్గొన్నారు.


వైద్య శిబిరానికి హాజరైన జనం

వారాహి దేవి నవరాత్రులు ప్రారంభం


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవి మందిరంలో వారాహీ దేవి నవరాత్రులు గురురవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ.. గురువారం అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు నిర్వహించి కుంకుమార్చన చేశారన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్ శర్మ, నిఖిల్ శర్మ, సువర్ణ లత, అరుణ, జయశ్రీ, కనకవల్లి, రాధ, సరిత, మైథిలి పాల్గొన్నారు

యాదవులకు సముచిత స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న అరవీంద్రనాథ్ యాదవ్

నాగోలు: యాదవులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం దేశ వ్యాప్త బీసీ కులగణనను నిర్వహించాలని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగోలు శుభం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక, రాజకీయంగా ఎదగాలని పేద యాదవులను ఆదుకోవాలని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో యాదవులకు ఒక మంత్రి పదవితో పాటు, 3 ఎమ్మెల్సీలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో యాదవులకు సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి తమ సమస్యలను విన్నవిస్తామన్నారు. ఈ సమావేశంలో లక్ష్మణ్ యాదవ్, హరిబాబు, శ్రీనివాస్ యాదవ్, రాజేందర్ యాదవ్, బాల మల్లేష్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీ నుంచి మదన్ బాబు, గంట్ల కృష్ణ సస్పెన్షన్

మలక్‌పేట: మలక్‌పేట నియోజవర్గం సైదాబాద్ డివిజన్‌కు చెందిన ఏ.మదన్‌బాబు, గంట్ల కృష్ణను కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు వారిని పార్టీ బాధ్యతలు, కార్యకలాపాల నుంచి తప్పిస్తూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ వలియాల్లా సమీర్ గురువారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ క్రమశిక్షణ, విలువ, ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్టీ సమావేశాల్లో దుర్వినియోగ పదాలను ఉపయోగించినందుకు టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ బాధ్యులు, పార్లమెంట్ పరిశీలకులతో జాగ్రత్తగా పరిశీలించి, సంప్రదించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలో నర్సింహస్వామి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని నర్సింహస్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫేస్–1 అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు వివరించారు. కాలనీలో డ్రైనేజీలు పొంగుతున్నాయని తాగునీటి వసతి కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆయా సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చిరంజీవి, అశోక్ రెడ్డి, రామచంద్రమ్ యాదవ్, అనిల్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

నియామకం



చైతన్యపురి: ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ జిల్లా కన్వీనర్‌గా గంగాధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జానరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కన్వీనర్‌గా నియమించినందుకు రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు అన్నారు. విద్యారంగ సమస్యలపై పోరాడుతానన్నారు. ముఖ్యంగా కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలన్నారు.

కాంగ్రెస్‌తోనే ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి


రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఏమీ లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆరోపించారు. వనస్థలిపురం డివిజన్ వనస్థలిహిల్స్‌కాలనీలో రూ.19.80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఆయన రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏడాదిన్నర కాలంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో రూ. 100 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో ఇక్కడ కట్టిన పన్నులను సిరిసిల్ల తదితర ప్రాంతాలకు తరలించి అక్కడ అభివృద్ధి చేశారని, ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లో చేసిన అభివృద్ధి ఏమీలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మల్‌రెడ్డి యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచి కృష్ణమోహన్, జీహెచ్‌ఎంసీ ఈఈ కార్తీక్, ఏఈ విఘ్నేశ్వరి, జలమండలి డీజీఎం రాజగోపాల్, ఏఈ సాయిశ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

చిత్ర కళాకారులను గుర్తించాలి

నాగోలు: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న చిత్ర కళాకారులను కూడా ప్రభుత్వ పరంగా కళాకారులుగా గుర్తించాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ సుందర్ గౌడ్, ఇతర నాయకులు గురువారం తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ అధికారి మామిడి హరికృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో చిత్ర కళాకారులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకముందే తెలంగాణ గోడ రాతల యాత్ర పేరుతో ఆంధ్రా తెలంగాణ 3 సరిహద్దుల దగ్గర తెలంగాణ రాష్ట్రం అన్ని రోడ్ల మీద రాస్తూ, గోడలపై తెలంగాణ రాష్ట్రం మన జన్మ హక్కు అని రాస్తూ తెలంగాణ ప్రజలను చైతన్యవంతం చేయడంలో చిత్ర కళాకారుల పాత్ర మరువలేదన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్, రాజేష్‌గౌడ్, అయిల్‌రెడ్డి, అమర్‌నాథ్, రవి, ధనుంజయగౌడ్ పాల్గొన్నారు.


వినతిపత్రంధిస్తున్న చిత్ర కళాకారులు

ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

నాగోలు: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మన ఆలోచన సాధన సమితి(మాస్)రాష్ట్ర అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, ప్రచార కార్యదర్శి పెదవుర బ్రహ్మయ్య అన్నారు. గురువారం నాగోలు మాస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు రోజురోజుకి విద్యను వ్యాపారంగా మారుస్తూ లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో సరైన వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో దేవేందర్, వెంకట్ యాదవ్, శంకర్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ చారి, నరసింహ గౌడ్ పాల్గొన్నారు

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లింగోజిగూడ: ప్రజలు కడుతున్న పన్నులతో కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆదిత్యనగర్‌లో రూ.22 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సంవత్సరం నుంచి టెండర్లు పూర్తయి పెండింగ్‌లో ఉన్న పనులు ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయని తెలిపారు.నిధులు మంజూరు కాని అభివృద్ధి పనులకు జోనల్ కమిషనర్ చొరవతో నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు కృష్ణ, రాజేందర్ ప్రసాద్, మురళీధర్‌రెడ్డి, బిక్షపతి, రామకృష్ణ, చంద్రశేఖర్, వెంకటేశ్, బలరాం, శంకర్ పాల్గొన్నారు.